క్లుప్తంగా...

రేపు ఊరూరా చెరువుల పండగ

మణికొండ: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం 5 గంటలకు గండిపేట మండల పరిధిలోని కోకాపేట కొత్త చెరువు, మణికొండ ఎల్లమ్మ చెరువు, పీరం చెరువుల ఊరూర చెరువుల పండగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ నిఖేష్ తెలిపారు. సాయంత్రం 5గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో మిషన్ కాకతీయ అందించిన ఫలాలు, పెరిగిన భూగర్భ జలాలు, మిషన్ కాకతీయ పథకం ద్వారా నియోజకవర్గంలో 55 చెరువులను పునరుద్ధరించిన వివరాలు, రెండు మినీ ట్యాంక్‌బండ్‌ల అభివృద్ధి వివరాలను ప్రజలకు వివరిస్తామన్నారు. అనంతరం స్థానికులకు భోజనం అందజేస్తామన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు



శంషాబాద్ రూరల్: ఘాంసిమియాగూడ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. పెద్దషాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు జరిపారు. యునైటెడ్ వే ఆఫ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టరు తెలిపారు.

ఖైరతాబాద్ ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు గడువు 10 వరకు

విజయనగర్‌కాలనీ: ఖైరతాబాద్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో చేరాలనుకున్న విద్యార్థులు తమ దరఖాస్తులను ఈనెల 10వ తేదీలోపు సమర్పించాలని ప్రిన్సిపాల్ జంజిరాల వెంకన్న పేర్కొన్నారు. ఐటీఐలోని ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు, రిజర్వేషన్ల ప్రకారం.. ప్రవేశాల ప్రక్రియ ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలను మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఉన్న ఖైరతాబాద్ ఐటీఐ, 89192 34137లో లేదా వెబ్‌సైట్ http://iti.telangana.gov.in లో పొందవచ్చు.

ట్రిపుల్‌ఐటీలో నాలుగు స్టార్టప్‌లు ప్రారంభం

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో ఇంక్యుబేషన్ సెంటర్‌గా గుర్తింపు పొందిన సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(సీఐఈ) ఆధ్వర్యంలో ఆవిష్కార్ డీప్ టెక్ యాక్సిలరేటర్ సమ్మర్–2023 కోహోర్ట్‌ను ప్రారంభించారు. కోహోర్ట్ డీప్ టెక్, మెడ్‌టెక్, మీడియాటెక్, మొబిలిటీ డొమైన్ నాలుగు స్టార్టప్‌లతో ప్రారంభించారు. ఈ స్టార్టప్‌లు సీడ్ ఫండ్‌తో పాటు 6నెలల ప్లాన్‌ను అందుకుంటాయి.

గురుకుల పాఠశాలకు ఆరుగురు విద్యార్థుల ఎంపిక

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల నల్లగండ్ల ప్రైమరీ స్కూల్ నుంచి గురుకుల స్కూల్‌కు 6 గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎ.మహేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. 4వ తరగతి విద్యార్థులు యశ్వంత్, నాని, శిరీష, రాజేశ్వరి, మోక్షిత్, ఆంజనేయులు ఎంపికయ్యారని వివరించారు. వారికి టీసీ, స్టడీ సర్టిఫికెట్లను అందజేశారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు.

పోలీస్‌స్టేషన్ విభజన శాస్త్రీయంగా జరపాలి



అడిషనల్ సీపీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

చాంద్రాయణగుట్ట: పోలీస్‌స్టేషన్ల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌ను అశాస్త్రీయంగా విభజించడం సరైంది కాదని బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్ గ్యార ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు బీజేపీ నాయకుల బృందం మంగళవారం అదనపు సీపీ విక్రం సింగ్ మానూకు వినతి పత్రాన్ని అందజేశారు. విభజన పేరుతో చాంద్రాయణగుట్ట పరిధిని అధికారుల స్థానిక అంశాలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. స్టేషన్ పక్కనే ఉన్న ప్రాంతాలను వదిలేసి సుదూర ప్రాంతాలను మాత్రం కలపడంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఈ విషయంలో అధికారులు పునరాలోచించాలన్నారు. ఈ విషయమై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని అదనపు డీసీపీ వారికి హామీ ఇచ్చారు.

రంగు మారిన నీళ్లు.. తాగితే రోగాలే!

గౌలిపురా డివిజన్‌లోని పలు బస్తీలో సరఫరా అవుతున్న కలుషిత నీరు



కలుషిత నీటిని చూపుతున్న ప్రజలు

- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోని వైనం



గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని పలు బస్తీలో కొన్ని రోజులుగా కలుషిత తాగునీరు సరఫరా అవుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డివిజన్‌లోని దానయ్యనగర్, సర్దార్ పటేల్‌నగర్, బాలాగంజ్, అచ్చయ్యనగర్, అంబికానగర్, ఎస్సార్టీ కాలనీ, కందికల్ గేట్, న్యూ ఛత్రినాక తదితర ప్రాంతాల్లో కొన్ని రోజులుగా కలుషిత తాగునీటి సరఫరా జరుగుతుంది. రోజు విడిచి రోజు సరఫరా అయ్యే మంచినీరు కొన్ని రోజులుగా కలుషితంగా సరఫరా జరుగుతుండటంతో తాగడానికి నీరందక తాము పడరాని పాట్లు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కలుషిత నీరు సరఫరా కావడంతో నీటిని బయటికి నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కలుషిత నీరు తాగి తాము ఎలాంటి రోగాల బారిన పడాల్సిన వస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. దీనిపై జలమండలి ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కలుషిత నీటి సరఫరాను అరికట్టి ప్రజలను రోగాల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

చర్యలు చేపట్టాలి..



గత వారం, పది రోజులుగా ఎస్సార్టీ కాలనీలో కలుషిత తాగునీటి సరఫరా జరుగుతుంది. తాగానికి నీరు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. నీరు ఇంటి అవసరాలకు కూడా వినియోగించలేని విధంగా సరఫరా అవుతుంది. కలుషిత తాగునీటి సరఫరాను అరికట్టాలని జలమండలి అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. – సత్యనారాయణ, ఎస్సార్టీ కాలనీ

కలుషిత తాగునీటి సరఫరాను నివారిస్తాం..



గౌలిపురా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సరఫరా అవుతున్న కలుషిత నీటి సరఫరాపై సంబంధిత జలమండలి అధికారిని వివరణ కోరగా దానయ్యనగర్, ఎస్సార్టీ కాలనీల్లో కలుషిత నీటి సరఫరాను గుర్తించాం. కందికల్‌గేట్ బ్రిడ్జి నిర్మాణం సమయంలో కచ్చా మోరీ లైన్‌ను తీశారు. దీంతో పలు ప్రాంతాల్లో కలుషిత నీటి సరఫరా జరుగుతుంది. ప్రస్తుతం దానయ్యనగర్, ఎస్సార్టీ కాలనీల్లో పనులను నిర్వహిస్తున్నాం. నాలుగైదు రోజుల్లో కలుషిత తాగునీటి సరఫరాను నివారిస్తాం.– సయ్యద్ ముఖరం బాబా, జలమండలి అలియాబాద్ సెక్షన్ మేనేజర్

కాటేదాన్ ఇండస్ట్రియల్ ఏరియాలో పారిశ్రామిక ప్రగతి ఉత్సవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని కాటేదాన్ ఇండస్ట్రియల్ ఏరియాలో మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది సంబరాల్లో భాగంగా పారిశ్రామిక ప్రగతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వం 2014లో ఏర్పడిన తరువాత పారిశ్రామిక ప్రగతిలో సాధించిన విజయాలను టీఎస్ఐఐసీ ఫీల్డ్ అధికారి శ్రీకాంత్ రెడ్డి చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పారిశ్రామిక రంగంలో జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం, వెనుకబడిన ప్రాంతాల్లో కూడా ఉపాధి అవకాశాలను సృష్టించడం కోసం తెలంగాణ ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, కార్పొరేటర్ అర్చన జయప్రకాష్, ఎంపీపీ జయమ్మ, శంషాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మా, ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ చంద్రశేఖర్‌గౌడ్, ఎంపీడీఓ వసంతకుమారి, టీఎస్ఐఐసీ కమిషనర్ అజిజియా సుల్తానా పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



హౌసింగ్ బోర్డు కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీ, బస్తీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నట్లు కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. డివిజన్ పరిధిలోని హౌస్లింగ్ బోర్డు కాలనీలో స్థానికుల విజ్ఞప్తి మేరకు కాలనీలో సీసీ రోడ్డు, స్ట్రీట్ లైట్స్, మౌలిక సదుపాయాలపై జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతిరోజూ ప్రతి కాలనీ, బస్తీలలో పర్యటించి సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటికి అప్పటికప్పుడు పరిష్కారాలు చూపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు అడికే జనార్దన్, శ్రీకాంత్‌రెడ్డి, జమ్మన్న, బలరామ్, ప్రసాద్, నారాయణ, జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి, టి.చిన్న, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, జలమండలి అధికారులు జియా, సూపర్‌వైజర్ వినయ్ పాల్గొన్నారు.

'ఫ్లైఓవర్ సమస్యపై రాజకీయలు చేస్తే సహించేది లేదు'



మాట్లాడుతున్న కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్ తదితరులు

శంషాబాద్: సిద్ధాంతి ఫ్లైఓవర్ సమస్య పరిష్కారానికి చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కేంద్ర మంత్రులతో పాటు ఉన్నతాధికారులకు సమస్యను నివేదించి పరిష్కరించే విధంగా అడుగులు వేస్తుంటే.. కాంగ్రెస్ నేతలు అడ్డగోలు విమర్శలు చేస్తూ రాజకీయాలు చేయడం తగదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, స్థానిక కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లైఓవర్ ప్రాంతం ఇరుకుగా మారడానికి గత ప్రభుత్వాలు సరైన నిర్ణయం తీసుకోకపోవడమే ప్రధాన కారణమన్న సంగతి తెలియదా అని ప్రశ్నించారు. ఎంపీ ఇచ్చిన హామీ మేరకు కేంద్ర అధికారులను ఒప్పించిన మాట వాస్తవం కాదా అన్నా రు. కేవలం నెలల వ్యవధిలోనే సమస్య పూర్తిగా పరిష్కారం జరుగుతుందా..? అని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రమేష్, రాజు, సిద్దు లు, మనిబాబు, ప్రవీణ్, సుధాకర్ తదితరులున్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



దర్గాఖలీజ్‌ఖాన్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: కంటి సమస్యలు ఉన్న ప్రతిఒక్కరూ తమ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న కేంద్రాలకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ తెలిపారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 11వ డివిజన్ దర్గాఖలీజ్‌ఖాన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్ అస్లాంబిన్ అబ్దుల్లాలు హాజరై కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందన్నారు. నిపుణులైన వైద్య బృందంతో అవసరమైన తగు కంటి పరీక్షలు కూడా చేయబడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వేణుగోపాల్ రెడ్డి, మలాకీ రత్నం మల్లేష్‌యాదవ్, ప్రవీణ్, వైద్య బృందం పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రాజేంద్రనగర్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బండ్లగూడకు చెందిన రాజేందర్(40) వృత్తిరీత్యా డ్రైవర్. కర్ణాటకకు చెందిన రాజేందర్ కొన్ని సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం భార్య పిల్లలతో బండ్లగూడకు వలస వచ్చాడు. కొన్ని రోజులుగా తాగుడుకు బానిసై విధులకు హాజరుకాకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు రోజురోజుకూ పెరిగిపోతుండడంతో భార్యతో తరచూ గొడవపడుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన రాజేందర్ శిశుమందిర్ ప్రాంతంలోని ఖాళీ స్థలంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకున్నాడు. స్థానికులు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాక్సింగ్ క్రీడాకారులకు చేయూత



క్రీడాకారులకు ట్రాక్ షూట్‌లను అందిస్తున్న గోవిందరెడ్డి

మణికొండ: జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ట్రాక్ షూట్‌లను అందించి ఓ నిర్మాణ సంస్థ అండగా నిలిచింది. 6వ యూత్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో రాణించి ఈనెల 12వ తేదీ నుంచి 18వ వరకు సిక్కిం రాష్ట్రంలో జరగబోయే జాతీయ పోటీలలో వారు పాల్గొంటున్నారు. అయితే వారికి సరైన సౌకర్యాలు లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆ విషయాన్ని తెలుసకున్న గ్రీన్ స్పేస్ నిర్మాణ సంస్థ చైర్మన్ గోవిందరెడ్డి వారికి అన్ని విధాలుగా స్పాన్సర్ చేసేందుకు ముందుకు వచ్చారు. అందులో భాగంగా మంగళవారం ఆయన వారికి ట్రాక్ షూట్‌లను అందించటంతో పాటు జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అయ్యే ఖర్చులను అందజేశారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి మాట్లాడుతూ.. పలు రంగాల్లో రాణించే అవకాశం ఉండి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు ఎవరైనా తమను సంప్రదిస్తే వారికి అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు టైటాన్స్ ఇండియా కబడ్డీ కోచ్ శ్రీనివాస్‌రెడ్డి, మణికొండ మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాఘవరెడ్డి, రాష్ట్ర బాక్సింగ్ సెక్రటరీ రవీందర్, ప్రతినిధులు ఎల్లయ్య, లక్ష్మణ్, వినేష్‌బాబు, శివకుమార్, టీం కోచ్‌లు లోకేష్, రఘువీర్, మేనేజర్ రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ మరమ్మతు పనులు ప్రారంభం



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని ఆలింద్, బాపూనగర్‌లలో మంజీర పైప్‌లైన్ మరమ్మతు పనులను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మంగళవారం ప్రారంభించారు. పైప్‌లైన్ పగిలి నీరు వృధాగా పోతుండటంతో వాటర్ వర్క్స్ అధికారులతో కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ మాట్లాడారు. టీఆర్ఎస్ నాయకులు గోపాల్‌యాదవ్, లక్ష్మణ్ యాదవ్, రవీంద్ర రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని వినాయక్‌నగర్, గాయత్రీనగర్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం మేయర్ మహేందర్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, కాంట్రాక్టర్లకు పలు సలహాలు సూచనలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను చేపట్టాలన్నారు. త్వరితగతిన సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కుమారస్వామి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

'ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకుంటున్నా'



నానల్‌నగర్ డివిజన్‌లో స్థానికులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో క్రమంతప్పకుండా ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకుని, వారి సమస్యలను తెలుసుకుంటున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని మేరాజ్‌కాలనీ, నిజాం కాలనీలలో పర్యటించారు. ప్రణాళికబద్ధంగా తాను అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయించి పనులు చేయిస్తున్నానన్నారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎంపీ లాడ్స్ నిధులతో సైతం కార్వాన్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయించారన్నారు. వర్షాకాలం వస్తున్నందున రెండు నెలలుగా కార్వాన్ అన్ని డివిజన్‌లలో డ్రైనేజీలకు పూడికలు తీయించి ధ్వంసమైన డ్రైనేజీ పైపులను తొలగించి కొత్తవి వేశామన్నారు. టోలిచౌకి కార్పొరేటర్ ప్రతినిధి హారూన్ ఫరాన్, సయ్యద్ రఫత్ హుస్సేన్, అలీమొద్దీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌అలీ తదితరులున్నారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించిన అధికారులు



రేకుల ప్రహరీని తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

మణికొండ: పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కలుపుకుని వేసిన రేకుల ఫెన్సింగ్‌ను రెవెన్యూ అధికారులు మంగళవారం తొలగించారు. గండిపేట మండల పరిధిలోని మంచిరేవుల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 228లో ప్రభుత్వ భూమి ఉంది. పక్కనే భూమి ఉన్న యజమానులు కొంత ప్రభుత్వ భూమిని కలుపుకుని రేకుల ప్రహరీని ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాజశేఖర్ ఆదేశాలతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కుమార్ తమ సిబ్బందితో మంగళవారం సాయంత్రం వాటిని తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదన్నారు.

గుడిమల్కాపూర్‌లో ఇంటింటికీ బీజేపీ

గోల్కొండ: తెలంగాణలో బీజేపీకి ప్రజాదరణ పెరుగుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ డివిజన్‌లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ప్రజలను కలుసుకుని 9 ఏళ్ల నరేంద్రమోదీ పాలనలో దేశం సాధించిన విజయాలు, పేదలకు అందిన సంక్షేమ ఫలాలను వివరించారు. అదే విధంగా తెలంగాణలో కేసీఆర్ పాలనలో ప్రజలు ఏ విధంగా మోసపోయారో ప్రజలకు వారు వివరించారు. ఆయన వెంట నామా యాదగిరి నేత, అశ్విన్, ప్రభు పూజారి, మురళీకృష్ణ తదితరులున్నారు.

గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో హరితహారం



ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

గోల్కొండ: ఆస్పత్రి ప్రాంగణలో పచ్చని మొక్కలు ఉంటే ఆస్పత్రి సిబ్బందితో పాటు ఆస్పత్రి ఇన్‌పెషెంట్‌లకు ఎంతో ప్రయోజకరంగా ఉంటుందని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మహజర్ ఉల్లా అన్నారు. మంగళవారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో కలిసి ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆయన వెంట వైద్యులు డాక్టర్ రజనీ, హెడ్ నర్స్ కమలమ్మ, గోపాలకృష్ణ తదితరులున్నారు.

శ్రీరామనగర్‌లో బీజేపీ నాయకుల పర్యటన



గచ్చిబౌలి: శేరిలింగంపల్లిలో సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తామని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. గడప గడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొండాపూర్ డివిజన్‌లోని శ్రీరామనగర్ ఏ బ్లాక్‌లో పాదయాత్ర నిర్వహించి ఇంటింటికీ బీజేపీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 ఏళ్లగా ఎమ్మెల్యే గాంధీ ప్రజల కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఎమ్మెల్యే అనునూయుల స్వలాభం కోసం అవినీతికి, అక్రమాలు, భూ కబ్జాలు, వసూళ్లకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి చేసింది, ప్రజలకు సేవ చేసింది భిక్షపతియాదవ్ మాత్రమేనని అన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవ చేస్తామని, బీజేపీ అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, నాయకులు ఓబుల్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, వెంకటేష్, అనంతరెడ్డి, రంగస్వామి, ఆంజనేయులు, కృష్ణ, పద్మ, పార్వతి, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా పంటి నొప్పి మందు

గోల్కొండ: పంటి నొప్పి, పళ్ల వాపు, పిప్పి పండ్లు మొదలగు పంటి వ్యాధులకు ఉచితంగా మందు పంపిణీ చేస్తున్నామని మహబూబియా హెర్బల్ ప్రొడక్ట్ ప్రతినిధి మహ్మద్ అన్నారు. వనమూలికలతో తయారు చేయబడిన ఈ ఔషధాన్ని అన్ని రకాల పళ్ల సమస్యల కోసం పని చేస్తుందని ఆయన తెలిపారు. మహబూబియా హెర్బల్ ప్రొడక్ట్ వారి సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ పంటి నొప్పి మందును ఈనెల 20వ తేదీ వరకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. మందు కావాల్సిన వారు గోల్కొండ రిసాలబజార్‌లోని అక్తరీ మసీదు సమీపంలో గల మహబూబియా హెర్బల్ ప్రొడక్ట్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పొందవచ్చని ఆయన అన్నారు. వివరాలకు 77940 01186లో సంప్రదించవచ్చు.

బత్తిని కుటుంబానికి పద్మశ్రీ అవార్డు ఇవ్వాలి



బత్తిని గౌరీ శంకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న వి.హనుమంత్‌రావు

చార్మినార్: మృగశిర కార్తె సందర్భంగా ప్రతి సంవత్సరం దీర్ఘకాలంగా ఆస్తమా రోగులకు ఉచితంగా చేప ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న బత్తిని కుటుంబానికి పద్మశ్రీ అవార్డును ఇవ్వాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంత్ రావు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 9న చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా మంగళవారం హనుమంత్‌రావు పాతబస్తీ దూద్‌బౌలిలోని బత్తిని సోదరులు ఉంటున్న నివాసానికి టీపీసీసీ ఫిషర్మెన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కె.వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌గౌడ్ తదితరులతో కలిసి వెళ్లి చేప ప్రసాదం తయారు చేసే విధానాన్ని, పంపిణీ వివరాలను బత్తిని కుటుంబ సభ్యులైన గౌరీ శంకర్‌గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బత్తిని గౌరీ శంకర్‌ను హనుమంత్ రావు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఆస్తమా రోగులకు ఉచితంగా చేప ప్రసాదం పంపిణీ చేస్తూ నిస్వార్థంగా ప్రజలకు సేవలను అందిస్తున్న బత్తిని కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి వారికి అరుదైన పద్మశ్రీ పురస్కారాన్ని అందించాలని డిమాండ్ చేశారు.